క్లుప్తంగా

బైక్‌లపై కశ్మీర్ యాత్ర



కశ్మీర్‌కు వెళుతున్న యువకులు

హుస్నాబాద్: చేయాలనే తపన ఉండాలే కానీ ఏదైనా సాధించవచ్చు అనేది నిరూపించారు ఓ ముగ్గురు యువకులు. విజయవాడ నుంచి కశ్మీర్‌లోని లద్దాఖ్ వరకు బైక్‌లపై వెళుతున్న ముగ్గురు యువకులు బుధవారం హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడ నుంచి బయలుదేరి మంచిర్యాల్ నుంచి నాగపూర్ హైవే మీదుగా కశ్మీర్‌కు వెళుతున్నట్లు చెప్పారు. తమ ప్రయాణం 45రోజులు ఉంటుందని, సరదా కోసమే ఈ యాత్ర చేస్తున్నామని ఆ యువకులు తెలిపారు.

డీఎం అండ్ హెచ్ఓ తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న శ్రీనివాస్

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిద్దిపేట డీఎం అండ్ హెచ్ ఓ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఓపీ వివరాలు, రికార్డులను పరిశీలించారు. మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచి ప్రజలకు సదుపాయం కల్పించాలని సూచించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి రోగులకు వైద్య సేవలు అందించాలని, సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ శ్రీనివాస్, వైద్యాధికారి కృష్ణతేజ, ఫార్మాసిస్ట్ అనురాధ, సూపర్‌వైజర్ కళావతి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం



నగదు అందజేస్తున్న ఎంపీపీ కరుణాకర్

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని శబాష్ గూడెం గ్రామానికి చెందిన రాజపేట స్వామి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మృతుడి కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ నగదును ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ బుధవారం ఆ కుటుంబ సభ్యులకు అందజేశారు. మాజీ సర్పంచ్ బొడ్డు స్వప్నకిరణ్, గుద్దేటి కనకయ్య, గజ్జి కనకయ్య, శ్రీరాముల కనకయ్య, మర్పడిగె భాస్కర్ ఆయన వెంట ఉన్నారు. అలాగే ఆకునూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన యాకూబ్‌పాషా కుటుంబ సభ్యులకు ఉల్లెంగుల సేవా ట్రస్ట్ చైర్మన్ ఉల్లెంగల ఏకానందం రూ.5వేల ఆర్థికసహాయం అందించారు.

మద్దూరు(హుస్నాబాద్)లో..

మద్దూరు మండల పరిధిలోని నర్సాయిపల్లి గ్రామానికి జిందం మల్లేశం రెండు రోజుల క్రితం మృతి చెందాడు. దీంతో బుధవారం యూత్ అసోసియేషన్ సభ్యులు, మల్లేశం కుటుంబ సభ్యులకు రూ.23వేలు ఆర్థిక సహాయం అందించారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు



సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

హుస్నాబాద్: స్థానిక బ్రాహ్మణవీధిలో వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణం కోసం భక్తులు విరాళాలు ప్రకటించారు. బుధవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు మంతెన ప్రభాకర్‌రావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన తిరుమల గార్డెన్ నిర్వాహకుడు రూ.2లక్షలు, మర్యాల తిరుమల్ రెడ్డి రూ.2లక్షలు, కొండ్లె శరత్ రూ.55,536, సుద్దాల చంద్రయ్య రూ.50వేలు, బెజుగం శ్రీనివాస్ రూ.50వేలు, భూంపల్లి రామారావు రూ. 25,116, గంద్ర రాధాకిషన్ రావు రూ. 20,116 విరాళాలు ప్రకటించారు. ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరు సహాయ, సహకారాలు అందించాలని ఆలయ కమిటీచైర్మన్ ప్రభాకర్‌రావు పిలుపునిచ్చారు. చంద్రయ్య, మురళీధర్ స్వామి, శివయ్య, శరత్, వీర సోమయ్య, శ్రీనివాస్, మల్లికార్జున్ రెడ్డి, రవీందర్‌రావు, రాజు, నవీన్ పాల్గొన్నారు.

మెదక్‌లో బీఆర్ఎస్‌దే గెలుపు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మెదక్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉద్యమాల ఖిల్లా మెదక్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి భారీ మెజారిటీతో గెలువడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రెండు జాతీయ పార్టీలపై బీఆర్ఎస్ విజయం సాధిస్తుందన్నారు.

బేలర్‌తో గడ్డి వృథాకు చెక్



హార్వెస్టర్‌తో కోసిన గడ్డిని కట్టలు కడుతున్న బేలర్ యంత్రం

- హార్వెస్టర్ కోతలతో పనికిరాని పశుగ్రాసం
- కోత తర్వాత వరికట్ట కట్టే యంత్రం
- రూ.30నుంచి 35 వసూలు

హార్వెస్టర్‌తో కోసిన వరి పొలాల్లో గడ్డి తక్కువగా రావడంతోపాటు పొలంలో పడి వృథాగా మారుతోంది. దీంతో రైతులు ఆ అలాంటి గడ్డిని కాల్చేస్తున్నారు. డైరీ ఫారం నిర్వాహకులకు, పాల వ్యాపారంపై ఆధారపడుతున్న పాడిరైతులకు పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో బేలర్ యంత్రాలు బాగా ఉపయోగపడుతున్నాయి.

దుబ్బాకటౌన్: వరిగడ్డి కట్టే బేలర్ యంత్రాలు ట్రాక్టర్‌కు అనుసంధానం చేయబడి ఉంటాయి. హార్వెస్టర్ పంటను కోసినప్పుడు పొలంమంతా పడిన గడ్డిని బేలర్ యంత్రం కట్టలు కడుతుంది. ఎకరం పొలంలోని గడ్డిని గంటలోపే దాదాపు 40–50 కట్టలుగా కడుతుంది. ఒక్కో కట్టకు రూ.30–35 తీసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులు పొలంలోని గడ్డిని తీసుకెళ్లేందుకు ముందుగా రైతులకు ఎంతో కొంత డబ్బు చెల్లించి యంత్రంచేత కట్టలు కట్టిస్తున్నారు. గడ్డికి సైతం డబ్బులు వస్తుండడంతో చాలా మంది రైతులు బేలర్‌వైపే మొగ్గు చూపుతున్నారు.

వరిగడ్డికి భలే డిమాండ్

వానాకాలం సీజన్ వరి పంట కోసేంత వరకు ఎండు గడ్డి దొరికే పరిస్థితి ఉండదు. వానాకాలం ముగిసేవరకు గడ్డి దొరికే అవకాశం లేకపోవడంతో ఆవులు, గేదెల ఫారాల రైతులు గడ్డిని కొనుగోలు చేసి 3, 4నెలలపాటు వచ్చేలా నిల్వ చేసుకుంటున్నారు. దీంతో గడ్డికి డిమాండ్ ఏర్పడుతోంది.

కట్టలు కట్టి నిల్వ చేసుకుంటున్నా..



నాకు రెండు పాలిచ్చే గేదేలు ఉన్నాయి. మళ్లీ 3–4 నెలల వరకు పశుగ్రాసం దొరకదు. ప్రస్తుతం హార్వెస్టర్ కోసిన గడ్డిని కట్టలు కట్టించి నిల్వ చేసుకుంటున్నా. కట్టలు కట్టినందుకు 100కట్టలకు సుమారు రూ.3 వేల వరకు ఖర్చవుతోంది.

– ఎల్లారెడ్డి, రైతు, దుబ్బాక

కూలీల ఖర్చు తగ్గింది



బేలర్ యంత్రాలు రాకముందు గడ్డి వాము పెట్టాలంటే రోజుకు ఒక్క కూలీకి రూ.600 నుంచి 7వందల వరకు చెల్లించే వాళ్లం. ఇప్పుడు ఈ యంత్రాలతో కట్టలు కట్టించడం వల్ల కూలీల ఖర్చు తగ్గింది. గడ్డిని ఎక్కువ రోజులు నిల్వ చేసుకోవచ్చు.

– భాస్కర్, రైతు, దుబ్బాక

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పదేళ్లపాటు కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలిసి ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. మండల పరిధిలోని అల్లీపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993–94 సంవత్సరంలో పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు బుధవారం కలుసుకుని సందడి చేశారు. వివిధ ప్రాంతాల్లో వేరువేరు ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడ్డ వారంతా వచ్చి ఉత్సాహంగా గడిపారు. ఆనాటి గురువులను సన్మానించారు.

– చిన్నకోడూరు(సిద్దిపేట)

ధాన్యం సేకరణలో జాప్యం

సీపీఎం నేత శెట్టిపల్లి సత్తిరెడ్డి



మాట్లాడుతున్న శెట్టిపల్లి సత్తిరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): ధాన్యం కొనుగోళ్ల త్వరితగతిన పూర్తి చేయాలని, కొన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గన్ని బ్యాగులు లేకపోవడంతో సేకరణ నిలిచిపోయిందని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి వాపోయారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గన్ని బ్యాగుల కొరతతో ధాన్యం సేకరణలో జాప్యం జరుగుతోందన్నారు. రైతులు ఎన్నో కష్ట నష్టాలకు ఓర్చి పండిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే అధికారుల నిర్లక్ష్యంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు వాన కాలం దగ్గర పడుతుండడంతో రైతులు ఆందోళన చేందుతున్నారని, వెంటనే ఉన్నత అధికారులు స్పందించి ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాడూరి రవీందర్, అత్తిని శారద, తేలు ఇస్తారి, నీల భిక్షపతి, ఆరుట్ల రవి, తాడూరి మల్లేశం, వుల్లంపల్లి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం కాలనీల్లో డ్రైనేజీలు శుభ్రం



డ్రైనేజీలు శుభ్రం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

దుబ్బాక: 'అధ్వాన్నంగా డ్రైనేజీలు.. ఇబ్బందులు పడుతున్న జనం' పేరిట బుధ వారం సాక్షిలో వచ్చిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్, ఇతర అధికారులు డబుల్ బెడ్రూం కాలనీని సందర్శించారు. కాలనీలో డ్రైనేజీలను శుభ్రం చేయించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్ మాట్లాడుతూ డ్రైనేజీలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయించి మురుగునీరు నిలువకుండా అన్ని చర్యలు చేపడతామని చెప్పారు.

సాక్షి ఎఫెక్ట్

బీజేపీ దుష్ప్రచారం మానుకోవాలి

బీఆర్ఎస్ నేత కరుణాకర్‌రెడ్డి

మర్కూక్(గజ్వేల్): బీజేపీ నేతలపై బీఆర్ఎస్ నాయకులు దాడి చేశారంటూ వస్తున్న ఆరోపణలను ఖండిస్తున్నామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మర్కూక్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం బీజేపీ కార్యకర్తపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారన్నారు. తమ పార్టీకి చెందిన ఎంపీపీ పాండుగౌడ్ అనుచరులు దాడిచేశారనే విషయంలో వాస్తవం లేదని చెప్పారు. నిజానిజాలు తెలియకుండా అవాస్తవాలను ప్రచారం చేయడం సరికాదన్నారు. బీజేపీ కార్యకర్తలు తమ పార్టీ కార్యకర్తలపై దుష్ప్రచారం చేయడం మానుకోవాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ బీసీసెల్ అధ్యక్షుడు కనకయ్య, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు గాయాలు

రాయపోలు(దుబ్బాక): ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు తీవ్రగాయాలైన ఘటన రాయపోలు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, ఎస్‌ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మహ్మద్ షకీనాబీ దౌల్తాబాద్ వెళ్లి పనిపూర్తయ్యాక బుధవారం ఆర్టీసీ బస్సులో రాయపోలుకు తిరిగి బయలుదేరింది. రాయపోలు రాగానే బస్సు దిగి గ్రామం వైపు వెళుతుండగా ఆర్టీసీ బస్సు వెనుకటైర్ల కింద పడింది. దీంతో ఆమె ఎడమకాలికి తీవ్రంగా గాయాలయ్యాయి. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమెను చికిత్స కోసం గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా శోభాయాత్ర



కోలాటం ఆడుతున్న మహిళలు

సంగారెడ్డి టౌన్: లక్ష్మీనారాయణస్వామి శోభాయాత్రను సంగారెడ్డి పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ శివారులోని వైకుంఠపురం దేవాలయం వద్ద ప్రధాన అర్చకులు వరదాచార్యులు రథయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటం ఆడుతూ ముందుకు సాగారు. కొండాపూర్ మండల పరిధిలోని మారేపల్లి గ్రామం వరకు రథయాత్ర కొనసాగింది.

మూలమలుపు.. ప్రమాదాలకు పిలుపు



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఉన్న మూలమలుపు

- సూచిక బోర్డు ఏర్పాటుపై నిర్లక్ష్యం
- చర్యలు తీసుకోవాలి: వాహనదారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మూలమలుపు ప్రమాదాలకు పిలుపుగా మారింది. దీన్ని గుర్తించని వాహనదారులు తరచు ప్రమాదాల బారిన పడుతున్నారు. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా లేకపోవడంతో వేగాన్ని నియంత్రించలేక ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొడుతున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలోనే మర్రిచెట్టు సమీపంలో ఈ ప్రమాదకర మూలమలుపు ఉంది. ఈ మార్గంద్వారా నిత్యం వందలాది మంది ప్రయాణిస్తుంటారు. ఎదురుగా ఏ వాహనం వస్తుందో తెలియని పరిస్థితి. ఈ మలుపు వద్ద పలు ప్రమాదాలు సంభవించాయి. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్న నిబంధనలు అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రమాదాలు జరగకుండా తగుచర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డిగ్రీ ప్రవేశాలకై ఉపాధ్యాయుల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకుడు

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో ప్రవేశాల కోసం పలువురు అధ్యాపకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పలు కాలనీల్లో పర్యటించి బుధవారం కరపత్రాలు పంచారు. కళాశాలలోని సౌకర్యాలు, వసతులు, అధ్యాపకుల వివరాలు, గత సంవత్సరం సాధించిన ఫలితాలు తదితర అంశాలను గురించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వివరించారు. తమ కళాశాలలో ప్రవేశం తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్‌కుమార్ మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ పాసైన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అనేక రకాల సౌకర్యాలు కల్పిస్తోందని, పేద, మధ్య తరగతి విద్యార్థులు అనవసరంగా ప్రైవేట్ కళాశాలల్లో చేరి ఫీజులు చెల్లించడానికి ఇబ్బందులు పడొద్దని సూచించారు. తమ కళాశాలలో విద్యార్థినులకు ఉత్తమ బోధన ఉంటుందని, లైబ్రరీ, విశాలమైన తరగతి గదులు, ఆటస్థలం, హాస్టల్ సౌకర్యం, సుదీర్ఘ అనుభవం కలిగిన అధ్యాపకులున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీతారాములు, అధ్యాపకులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ సువర్ణాదేవి, కిషోర్, హరిప్రసాద్, స్వప్న, శ్రీనివాస్, తిరుపతి, కమలాకర్, సంతోష్, ఇందిర, నరేశ్, బాల్‌లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి రానున్న పార్కు

మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్



పార్కులో పనులు పరిశీలిస్తున్న రమేశ్‌కుమార్

దుబ్బాక: పట్టణంలోని 18వ వార్డులో నిర్మిస్తున్న పార్కును త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్ తెలిపారు. మధ్యలోనే ఆగిపోయిన పార్కు నిర్మాణ పనులను బుధవారం ఆయన సందర్శించి పనులు పునః ప్రారంభింపజేశారు. అనంతరం మాట్లాడుతూ పార్కు పనులు త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. పిల్లలు, వృద్ధులతోపాటు అందరూ హాయిగా సేద తీరేలా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అన్ని వార్డుల్లో ప్రజల సమస్యలు పరిష్కరించి మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు వార్డుల్లో ఏ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్ తదితరులు ఉన్నారు.

స్వశక్తి సంఘాలకే ప్లాస్టిక్ నిర్వహణ కేంద్రాలు



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కొండల్‌రావు

బెజ్జంకి(సిద్దిపేట): గ్రామాలలో చెత్త సేకరణలో భాగంగా తీసుకువచ్చే ప్లాస్టిక్ సామగ్రి నిర్వహణ కేంద్రాన్ని స్వశక్తి సంఘాలకు అప్పగించనున్నట్లు పంచాయితీరాజ్ శాఖ సలహాదారు కొండల్‌రావు తెలిపారు. మండలంలోని బెజ్జంకి క్రాసింగ్‌ను బుధవారం ఆయన సందర్శించి డంపింగ్ యార్డును పరిశీలించారు. వీధులలో చెత్తలేకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో సేకరించిన చెత్తలోని ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేస్తారని తెలిపారు. వాటిపై మహిళా సంఘాల సభ్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛ్‌భారత్ మిషన్(గ్రామీణ) డైరెక్టర్ సురేశ్‌బాబు, డీపీఓ దేవకీదేవి, డీఆర్‌ఓ జయదేవ్‌ఆర్య, సిద్దిపేట, హుస్నాబాద్ డీఎల్‌పీఓలు మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, డీపీఎం కరుణాకర్, ఎంపీడీఓ లక్ష్మప్ప, బెజ్జంకి, కోహెడ, చిన్నకోడూర్ మండలాల ఏపీఎంలు, ఎస్‌బీఎం కోఆర్డినేటర్‌లు, వీఓఏలు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కు నాయకుల సన్మానం



బండి సంజయ్‌తో మండల నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): బీజేపీ ఎంపీ అభ్యర్థి, ఆ పార్టీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్ కుమార్‌ను ఆ పార్టీకి చెందిన పలువురు మండల నాయకులు కలిశారు. బుధవారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో మండల నాయకులు, కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యదర్శి కరీవేద మహిపాల్‌రెడ్డి తదితరులు కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బోయినిపెల్లి అనిల్ కుమార్, ముషికె మహేందర్, తూముల రమేశ్, రాజిరెడ్డి, మజీద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఉపాధ్యాయులపై లాఠీచార్జి సరికాదు

బెజ్జంకి(సిద్దిపేట): నారాయణఖేడ్‌లో ఉపాధ్యాయులపై జరిగిన లాఠీచార్జికి కారకులపై చర్యలు తీసుకోవాలని డీటీఎఫ్ మండల అధ్యక్షుడు పుల్లూరి ప్రభాకర్, ఎస్టీయూ మండల అధ్యక్షుడు రామంచ రవి బుధవారం వేరువేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. ఎన్నికల విధులు ముగించుకుని రెమ్యునరేషన్ అడిగిన ఉపాధ్యాయులపై దాడి చేయడం సరైంది కాదన్నారు. వెంటనే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

◆ పాతబావులు పూడ్చాలి

వర్గల్(గజ్వేల్): గ్రామంలో ఉన్న పాడుబడ్డ బావులు ప్రమాదకరంగా మారాయని మండలంలోని మజీద్‌పల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దోమలకు నెలవుగా మారి రోగాలు పంచుతున్నాయన్నారు. గృహావాసాల మధ్యనే ఉన్న ఈ పాతబావులు వెంటనే పూడ్చివేయించాలని కోరారు.

◆ తాగునీటి ఇబ్బందులు

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం నెంటూరు ఎస్సీకాలనీలో భగీరథ తాగునీటి కొరత నెలకొందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతంత మాత్రం నీటి సరఫరాతో ఇబ్బందిపడుతున్నామని, బోర్ల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నామని వాపోయారు. మిషన్ భగీరథ గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

◆ మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు పరామర్శ

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డుకు చెందిన పసుల స్వామి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ఆర్థిక సాయం అందించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు గంగిశెట్టి రవీందర్, స్వామిచారి, శేఖర్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

◆ హనుమాన్ దీక్ష మహిమాన్వితం

కొండపాక(గజ్వేల్): హనుమాన్ దీక్ష మహిమాన్వితమైనదని రామదాసు చారిటబుట్ ట్రస్టు చైర్మన్ గడీల చంద్రారెడ్డి పేర్కొన్నారు. కొండపాకలో హనుమాన్ దీక్ష స్వాములకు బుధవారం ట్రస్టు ఆధ్వర్యంలో పండ్లు, పాలు తదితర వస్తువులను అందజేశారు. బుక్క శ్రీనివాస్, బిజ్జ నవనీత, చరణ్, స్వామి దాతల సహాయంతో ఒక్క రోజు భిక్షకు సంబంధించిన వస్తువులను అందించారు. కార్యక్రమంలో మఠం బావి ప్రసన్నాంజనేయ స్వామి దీక్ష స్వాములు పాల్గొన్నారు.

◆ దాడికి పాల్పడిన వారిపై కేసు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వేచరేణి గ్రామంలో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కొమురవెల్లి ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో జరిగిన బీరప్ప జాతరలో భాగంగా ఎగుర్ల బాగయ్య ఇంటికి కొందరు బంధువులు వచ్చారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఒంటి గంట సమయంలో బంధువుపై ఎగుర్ల కరుణాకర్ తోపాటు కొంత మంది కలిసి కర్రలతో దాడిచేశారు. బాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

◆ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పరామర్శ

గజ్వేల్: ఇటీవల మృతిచెందిన సిటిజన్స్ క్లబ్ సభ్యుడు నేతి నర్సింహులు కుటుంబ సభ్యులను డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సింహులుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన వెంట గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, సిటిజన్స్ క్లబ్ అధ్యక్షుడు నాయిని యాదగిరి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, నాయకులు సమీర్ తదితరులున్నారు.

◆ మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ మృతి



కృష్ణమాచారి(ఫైల్)

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో కొన్ని సంవత్సరాలుగా జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణమాచారి ఇటీవల అనారోగ్యానికిగురై చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీంతో విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్, కౌన్సిలర్లు కృష్ణమాచారి అంత్యక్రియల్లో పాల్గొని సంతాపం తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందించి అండగా ఉంటామన్నారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

మునిపల్లి(అందోల్): ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాల కోసం మోడల్ స్కూల్, కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, ఎంఈసీ విభాగాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990